మహిళల ఆరోగ్యమే లక్ష్యం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం (ఫైల్)

- స్వస్థ్ నారి.. సశక్త్ పరివార్‌తో అతివలకు ఆరోగ్య భరోసా
- ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్యులతో క్యాంపులు

దామరగిద్ద: కేంద్రప్రభుత్వం మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా 'స్వస్థ్ నారి.. సశక్త్ పరివార్'కు శ్రీకారం చుట్టింది. ఆరోగ్యకరమైన మహిళలే బలమైన కుటుంబానికి ఆధారం అనే లక్ష్యంతో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ముఖ్యంగా మహిళలు, యువతుల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఈ పథకంలో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

అక్టోబర్ 2 వరకు దేశ వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అతివరకు అనేక రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

నాలుగు క్యాంపులు నిర్వహించాం



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎస్ఎన్ఎస్‌పీఏ పథకంలో భాగంగా సెప్టెంబర్, 17, 22, 26, అక్టోబర్ 1న నాలుగు క్యాంపులను ఏర్పాటు చేశాం. ఈ శిబిరాలలో ప్రత్యేక వైద్య నిపుణులతో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాం. 400 లకు పైగా పేదలు క్యాంపునకు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య పరీక్షలతో పాటు పౌష్టికాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాం.

–సుదేష్ణ, వైద్యాధికారిణి, దామరగిద్ద

దామరగిద్ద మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాలుగు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రొమ్ము క్యాన్సర్, గైనిక్ సంబంధిత వ్యాధులతో పాటు ఇతర వ్యాధులకు వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 500 మందికి మహిళలు, బాలికలకు వివిధ పరీక్షలు చేయగా 15 మందికి తీవ్ర అనారోగ్యం ఉన్నట్లు గుర్తించి మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసినట్లు మెటర్నల్ హెల్త్ న్యూట్రిషన్(ఎంఎచ్ఎన్) జిల్లా ప్రోగ్రాం అధికారిణి సుదేష్ణ తెలియజేశారు.

ప్రత్యేక వైద్యసేవలు

ప్రత్యేక వైద్య శిబిరాలపై ఆయుస్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా అవగాహణ కల్పించి వివిధ క్యాంపుల్లో వైద్య నిపుణులు ఆరోగ్య సేవలను అందించారు. ప్రధానంగా ప్రసూతి, చిన్నపిల్లలు, కంటి, ఈఎన్‌టీ దంత, సైకియాట్రిస్ట్, చర్మవ్యాధి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. మహిళల్లో హిమోగ్లోబిన్ స్థాయి, బీపీ, మధుమేహం, క్యాన్సర్, టీబీ, స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టినట్లు వైద్యులు తెలిపారు. వీటితో పాటు పరిశుభ్రత, పౌష్టికాహారంపై అవగాహణ కల్పించి అతివల ఆరోగ్యానికి భరోసా కల్పించారు.

క్లుప్తంగా

డంపింగ్‌యార్డును మార్చాలి

మరికల్: మండల కేంద్రంలోని డంపింగ్ యార్డును వేరేచోటికి మార్చాలని ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ నాయకులు రఘు శనివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామ శివారులో డంపింగ్ యార్డు ఉండటం వల్ల దుర్వాసన వస్తుండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే వ్యాధుల బారిన పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన తమగోడు పట్టించుకోవడం లేదన్ని, వెంటనే డంపింగ్‌యార్డును ఊరికి దూరంగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జంతు సంపదను రక్షించుకుందాం

కోస్గి రూరల్: మనవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను రక్షించుకుందామని జాతీయ హరితదళ సమన్వయకర్త వార్ల మల్లేషం అన్నారు. శనివారం ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మీర్జాపూర్‌లోని ఉన్నత పాఠశాలలో 'పర్యావరణంలో జంతువుల పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అరుదైన జంతువులు అంతరించి పోతున్నాయని, జంతు సంపదను రక్షించాలని కోరారు. అడవులను నరికివేత, మంచి నీటి వనరుల విధ్వంసం వల్ల జంతువులు అంతరించిపోతున్నాయని చెట్లను పెంచి వాటి మనుగడను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు జనార్ధన్ ఉన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విజయగౌడ్ నియామకం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ విజయగౌడ్‌ను శనివారం రాష్ట్ర కల్లుగీత గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగ ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలాలకు చెందిన గౌడ సంఘం నాయకులు, వివిద పార్టీల నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను ఒమ్ము చేయకుండా గౌడ కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఇందులో మాజీ ఎంపీటీసీ సభ్యుడు నారాయణ, సిద్రాంరెడ్డి, బొల్ల మహదేవ్, తిమ్మప్ప, రాము పాల్గొన్నారు.

ఘనంగా మహబూబ్ సుహనీ గంధోత్సవం



మద్దూరు: దమ్‌గాస్‌పూర్‌లోని మహిబూబ్ సుహనీ గంధోత్సవాలు ఆయా దర్గా కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించినట్లు దర్గా పెద్దలు తెలిపారు. గంధోత్సవం అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శనివారం మద్దూరు, దమ్‌గాస్‌పూర్, నాగిరెడ్డిపల్లి, పర్సపూర్, ఖాజీపూర్ తదితర గ్రామాలకు చెందిన భక్తులు గ్యార్మిలు నిర్వహించారు. ఆదివారం జాతర ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఆర్వో ప్లాంటు నిర్వహణకు సహకారం



దేవరకద్ర: దేవరకద్ర జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్ నిర్వహణ కోసం శనివారం పూర్వ విద్యార్థులు సహకారం అందించారు. 1984–85 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పడమటి మోహన్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, అరుణ ఆర్ఓ ప్లాంట్ నిర్వహణకు సహకారం అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం చేయడానికి ముందుంటామని తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు పాఠశాల తరఫున సన్మానించారు. హెచ్ఎం రామలింగం, క్యాతరిన్, విజయకృష్ణ, వేణుగోపాల్, గోపాల్‌రెడ్డి, పరమేశ్, ప్రమీలారాణి, సుధాకర్, రాజశేఖర్, అశోక్, కవిత, షరీఫ్, అంజనమ్మ పాల్గొన్నారు.

చెట్టు తొలగించాలి



మాగనూర్: మండలంలో వర్కూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత ఆవరణలో ఓ చెట్టు ఎండిపోయి ప్రమాదకరంగా మారింది. చెట్టు మొత్తం ఎండిపోవడంతో ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యార్థులు మైదానంలో ఉన్నప్పుడు కూలితే ప్రమాదం తప్పదని అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గామాత నిమజ్జనం



నిమజ్జన కార్యక్రమంలో నృత్యం చేస్తున్న మహిళలు

నారాయణపేట రూరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ ఈశ్వర్ మందిర్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాత నిమజ్జన వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా డాక్టర్ రజిని మధుసూదన్ రెడ్డి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించగా అనంతరం దుర్గామాత శోభాయాత్ర గ్రామ పురవీధుల గుండా శోభయామానంగా కొనసాగింది. నిమజ్జనం ఊరేగింపులో మహిళలు, చిన్నారులు నృత్యాలు చేస్తూ భక్తులను ఆకట్టుకున్నారు. జాజాపూర్ భజన మండలి మహిళా సంఘాల సభ్యులు వేడుకలు తిలకించేందుకు భారీ ఎత్తున తరలివచ్చి భక్తిని చాటుకున్నారు.



జాజాపూర్‌లో కొలువుదీరిన దుర్గామాత

ఘనంగా నిమజ్జన ఉత్సావాలు

కోస్గి : పట్టణంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర శివసాయి అయ్యప్ప స్వామి దేవాలయంలో తొమ్మిది రోజలు ప్రత్యేకపూజలు అందుకున్న దుర్గామాతను భక్తులు శనివారం నిమజ్జనం చేశారు. ఈ ఉత్సవాల్లో హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన పోతురాజుల వేషధారణ ప్రత్యేక ఆకర్శణగా నిలిచింది. అలాగే శివాజీ చౌరస్తాలో పలు విన్యాసాలు చేపట్టారు. అనంతరం మండల పరిధిలోని సరజ్‌ఖాన్‌పేట గ్రామంలోని దండం చెరువులో నిమజ్జనం చేశారు.



నిమజ్జనానికి తరలిన దుర్గామాత



శివాజీ చౌరస్తాలో పోతురాజుల విన్యాసాలు

శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతం

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా శరన్నవ రాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయని విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కన్న శివకుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 60 మండపాల్లో దుర్గామాత విగ్రహాల ప్రతిష్ఠాపన జరిగిందని ఇందులో కేవలం నారాయణపేట జిల్లా కేంద్రంలోనే 18 చోట్ల అమ్మవారిని ప్రతిష్ఠించినట్లు పేర్కొన్నారు. ఉత్సవాలు విజయవంతం చేసినందుకు కృషిచేసిన ఆయా శాఖల అధికారులకు హిందూ బంధువులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భీమ్ చందర్, వెంకటయ్య, మురళి భట్టడ్, వడ్ల శ్రావణ్, ప్రవీణ్ కడుదాస్, రఘు, చెన్నారెడ్డి, రవి గౌడ్, చందు, రాజశేఖర్, ఆకాష్ పాల్గొన్నారు.

గుంతలమయం.. ప్రయాణికులకు నరకం



మండలకేంద్రంలోని లాల్‌కోట చౌరస్తా నుంచి కోయిల్‌సాగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా తయారైంది. దాదాపు 15 కిలోమీటర్ల రోడ్డు గుంతలమాయంగా మారడంతో పూసల్‌పహాడ్, గోటూర్ తదితర గ్రామాలకు వెళ్లే వాహనదారులు నరకయాతన పడుతున్నారు. రోడ్డు పక్కనే కోయిల్‌సాగర్ కుడి కాల్వ ఉండడం వల్ల పూసల్‌పహాడ్, కొండ్రోన్నిపల్లి, గోటూర్ శివారుల్లో కుడి కాల్వ తూముల నుంచి వచ్చే సాగునీరు రోడ్డుపై నుంచి పొలాల్లోకి పారడంతో రోడుపై మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడినట్లు వాహనదారులు పేర్కొంటున్నారు. కుడి కాల్వ తూముల నుంచి నీళ్లు వచ్చే దగ్గర రోడ్డుపై వంతెనలు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - మరికల్

వాహనాల తనిఖీ



కృష్ణా: మండల సరిహద్దులో శనివారం ఎస్ఐ ఎండీ నవీద్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు సరిహద్దులో శాశ్వత పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేయడంతో పాటు కర్ణాటక నుంచి మద్యం వంటి నిషేధిత పదార్థాలు రాష్ట్రంలోకి రాకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అదే విధంగా చెక్‌పోస్టులో లైటింగ్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దేశసమగ్రతే లక్ష్యం

దామరగిద్ద: దేశ సమగ్రతను ఇనుమడింప చేయడమే ఆర్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యమని ఆర్ఎస్ఎస్ పాలమూరు జిల్లా సహ కార్యవాహ మాడం ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని కాన్‌కుర్తి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ సంపూర్ణ వ్యక్తిత్వం, దేశభక్తి కల్గిన యువతరాన్ని తీర్చిదిద్దేందుకు కృషిచేస్తుందన్నారు. అంతకు ముందు ఆర్ఎస్ఎస్ ధ్వజారోహణం, భారత మాత, గురిజీల చిత్రపటాలకు, పూజలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ బాధ్యులు సురేశ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బస్వరాజ్, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

6న పీఓలకు శిక్షణ

ఊట్కూరు: పట్టణంలోని మండల పరిషత్ భవనంలో పీఓలకు సోమవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్నికల సందర్భంగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని, సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి విజయరాములు

ఆత్మకూర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసి పరిష్కరించుకున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఐ పార్టీకి ప్రజల తరఫున మద్దతు లభిస్తోందని, అన్ని స్థానాల్లో పోటీచేసి గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి లక్ష్మినారాయణశెట్టి, జిల్లా నాయకులు శ్రీహరి, సీఎన్‌శెట్టి, రాబర్టు, మోష, బాలరాజు, బాలకృష్ణ, లింగన్న, రమేష్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

గ్యార్మీ వేడుకలు ప్రారంభం



విద్యుత్ దీపాలతో ముస్తాబైన దర్గా

అమరచింత: గ్యార్మీ నెల ప్రారంభం కావడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పట్టణంలోని హజరత్ మహబూబ్ ఉస్సేనీ దర్గా షరీఫ్ దర్గాను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం రాత్రి గంధోత్సవం తర్వాత శనివారం కందూర్‌లతో గ్యార్మీ వేడుకలను ప్రారంభించారు.

కాల్వ నిర్మాణం చేపడతాం

సాక్షి ఎఫెక్ట్..



పొలంలో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న బాల్‌రాజ్

కొత్తపల్లి: కొత్తపల్లి తండాకు చెందిన రామునాయక్ పొలంలో నిలిచిన నీరు తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ ఏఈ బాల్‌రాజ్ అన్నారు. ఈ నెల 4న సాక్షిలో 'పొలంలోకి వరద.. దెబ్బతిన్న పంట' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందిచారు. మండలంలోని నిడ్జింత–కొత్తపల్లి మధ్య ఇటీవల రహదారి విస్తరణ పనులు చేపట్టారు. అయితే కల్వర్టు లేక పోవడంతో వర్షపు నీరంతా రామునాయక్ పొలంలోకి చేరడంతో జొన్న పంట దెబ్బతింది. దీంతో ఏఈ పంటను పరిశీలిలించి నీరు కల్వర్టులోకి వెళ్లేలా కాల్వ నిర్మాణం చేపడతామన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

మక్తల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మక్తల్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి సూచించారు. పట్టణంలోని ద్వారక ఫంక్షన్‌హాల్‌లో శనివారం మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. గ్రామాల్లో రిజర్వేషన్ ప్రకారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థల పేర్లను మండల కమిటీకి అందజేయాలన్నారు. కలిసి కట్టుగా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హన్మంతు, మార్కెట్ వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేశ్, కట్టసురేశ్ కావాలి తాయప్ప, మార్కెట్ డైరెక్టర్లు శ్రీనివాసులు, రంజిత్‌రెడ్డి, బీంరెడ్డి, రహిమాత్‌పాష, కావాలి శ్రీహరి, గడ్డం రమేశ్ పాల్గొన్నారు.

మండల నాయకుల సమావేశం

కృష్ణా: మండలంలోని చేగుంట గ్రామంలో శనివారం మండల కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలుపించుకోవాలని, అందుకు ఆయా గ్రామాలకు చెందిన నాయకులు సమర్థులైన నాయకులను ఎంపికచేయాలని కోరారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

ఊట్కూరు: స్థానిక ఎన్నికల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పని చేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని సమస్తాపురం గ్రామ శివారులోగల ఇండ్లూరు శంకర్‌లింగేశ్వర దేవాలయ సమీపంలో మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల వివరాలను సేకరించారు. సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించి అత్యధిక స్థానాలను కై వసం చేసుకోవాలని సూచించారు.

బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశం



సమావేశమైన బీజేపీ నాయకులు

కృష్ణా: మండల కేంద్రంలోని శంఖర మఠంలో శనివారం ఉమ్మడి మండల కార్యకర్తలతో బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అభ్యర్థుల గెలుపు, అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అదే విధంగా పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఆయా గ్రామాల నాయకులు మండల కమిటీకి ఇవ్వాలని సూచించారు. సమావేశంలో అమర్‌కుమార్‌దీక్షిత్, ఉట్కూర్ భాస్కర్, బల్‌రాంరెడ్డి, కర్నెస్వామి, నల్లె నర్సప్ప పాల్గొన్నారు.

ఒంటరిగానే పోరాటం

ధన్వాడ: స్థానిక సంస్థల ఎన్నికలో ఎవరితో పొత్తు లేకుండా ఒంటరిగానే అన్ని స్థానాల్లో బరిలోకి దిగుతామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమేష్‌కుమార్ అన్నారు. శనివారం ధన్వాడ మండల కేంద్రంలోని మాజీ ఎంపీపీ ఉదయభాను ఇంట్లో మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ ఎవరికి టికెట్ కేటాయిస్తే వారికి మద్దతు తెలుపాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, మండల అధ్యక్షుడు శివరాజు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నర్సింములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



కృష్ణా: మండలంలోని కున్సీ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు నర్సింహను శనివారం మండలంలోని ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ టీఎస్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా సీఎం చేతుల మీదుగా అవార్డును అందుకోవడంతో పాటు జాతీయస్థాయిలో ఆటబొమ్మల వినియోగం శిక్షణను ముగించుకొని వచ్చిన సందర్భంగా సన్మానించినట్లు సంఘం మండల అధ్యక్షుడు శేఖర్ తెలిపారు. ఉపాధ్యాయులు శివరాజ్, అజయ్, రామకృష్ణా, సంతోషి, నరేందర్ పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయండి

మాగనూర్: మండల పరిధిలోని నేరడగండోడ్డి గ్రామానికి వెళ్లే దారి అస్తవ్యస్తంగా తయారైంది. ముఖ్యంగా గ్రామ సమీపంలో గల కాలువ వంతెన కింద గుంత ఏర్పడి మురుగు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంత సమీపంలోనే పాఠశాలతో పాటు అంగన్వాడీ కేంద్రం ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గుంతను పూడ్చి రాకపోకలు సుగమం చేయాలని కోరుతున్నారు.

